




ధంసలాపురం ఊరచెరువు శిఖంలో వెలిసిన బోర్డు

- కోట్ల విలువైన శిఖం భూములు అన్యాక్రాంతం
- ఆక్రమణలతో తరిగిపోయిన ఖమ్మం లకారం చెరువు
- భద్రాచలం మనుబోతుల చెరువులో డబుల్ బెడ్ రూం ఇళ్లు
- అవకాశం ఉంటే చాలు చెరువులను చెరపడుతున్న అక్రమార్కులు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- హైడ్రా తరహా కార్యాచరణతోనే సంరక్షణ సాధ్యం

అక్రమం ఎక్కడైనా అక్రమమే.. చెరువులు, వాగులు, కుంటల ఆక్రమణలు జరిగితే అది హైదరాబాద్ అయినా ఖమ్మం అయినా మరోచోటైనా చట్టాలు, ప్రభుత్వ నిబంధనలు ఒకేలా ఉంటాయి. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో చెరువుల ఆక్రమణలపై 'హైడ్రా' ఆధ్వర్యంలో కొరడా ఝుళిపిస్తున్న ప్రభుత్వం... ఉమ్మడి జిల్లాలోని చెరువుల్లో జరిగిన ఆక్రమణలపై దృష్టిపెడుతుందా..? ఆయా చెరువులను ఆక్రమణ సంకెళ్ల నుంచి విడిపిస్తుందా...? అనేది ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఐటీడీఏ శాఖల ఆధ్వర్యంలో ఉన్న సాగు, తాగునీటి చెరువుల శిఖం భూములను, బఫర్‌జోన్ భూములను అక్రమార్కులు అడ్డగోలుగా మింగేస్తున్నారు. దీంతో చెరువుల స్వరూపం పూర్తిగా మారిపోతోంది. పాలకులు ఈ చెరువుల అక్రమాలపై దృష్టి పెట్టి జిల్లాస్థాయిలోనూ హైడ్రా వంటి సంస్థను రంగంలోకి దింపాలని ప్రజలు కోరుకుంటున్నారు.



తల్లాడ మండలం వెదుళ్ల చెరువు శిఖంలో నిర్మించిన భవనాలు

చెరువుల చెర

ఉమ్మడి జిల్లాలో చూస్తుండగానే మాయమైపోతున్న నీటివనరులు



ఖమ్మం లకారం చెరువు స్థలంలో నిర్మించ తలపెట్టిన షాదీఖానా

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఖమ్మం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/నెట్‌వర్క్: దశాబ్దాల క్రితం ఖమ్మం జిల్లాలో సాగునీరు, తాగునీరు అవసరాల కోసం నిర్మించిన చెరువులు యథేచ్ఛగా అన్యాక్రాంతమవుతున్నాయి. పట్టణాల్లో ఒకవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాగునీటి చెరువులను కబ్జా చేస్తుంటే పల్లెల్లో పంటపొలాలకు సాగునీరందించే చెరువుల సరిహద్దున ఉండే రైతులే ఆయా చెరువుల శిఖం భూములను కబ్జా చేస్తున్నారు. దీంతో కోట్ల విలువైన చెరువుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం చెరువులకు శాపంగా మారింది. భూములు ధరలు పెరగడంతో గతమూడు దశాబ్దాలుగా పలువురు అక్రమార్కులు చెరువులను టార్గెట్ చేసి ఎకరాలకు ఎకరాలు మింగుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ చెరువును పరిశీలించినా కబ్జా కథలే బయటపడుతున్నాయి. ఆయా కబ్జాలకు తెగబడేవారు తమను తాము కాపాడుకునేందుకు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి జైకొట్టి ప్రభుత్వం తమ జోలికి రాకుండా జాగ్రత్తపడుతున్నారు. ఎవరైనా అధికారులు అటువైపు వెళితే ప్రజాప్రతినిధులతో ఫోన్లు చేయించి అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు మారుతున్నా చెరువులకు కబ్జా చెర మాత్రం వీడడం లేదు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అనేక చెరువులు కబ్జాకు గురికాగా ప్రధాన చెరువుల్లో కొందరు దర్జాగా రియల్ వ్యాపారం చేస్తుండగా కొందరు పట్టాలు పొంది సొంతం చేసుకుంటున్నారు.

తరిగిపోయిన ఖమ్మం లకారం చెరువు

ఖమ్మం పట్టణంలో ఒకప్పుడు సాగు, తాగునీటి కోసం నిర్మించిన లకారం చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోయి నేడు పర్యాటక చెరువుగా మారింది. ఈ చెరువు 326 ఎకరాల్లో విస్తరించి ఉండగా ఆక్రమణల తరువాత ప్రస్తుతం 132 ఎకరాల్లో మిగిలింది. కొన్ని దశాబ్దాల క్రితం ఖమ్మం పట్టణానికి కేంద్రంగా లక్కారం చెరువుగా ఉండేది. అలాంటి ఈ చెరువు నాలుగువైపులా ఆక్రమణకు గురికావడంతో ప్రస్తుతం కేవలం 132 ఎకరాలే మిగిలింది. మిగిలిన భూముల్లో వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మించారు. వీటిని తప్పుడు పద్ధతుల్లో క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఖమ్మం పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందడంతో లకారం చెరువు కింద గతంలో ఉన్న ఆయకట్టు ప్రాంతం కూడా నివాసస్థలాలుగా మారిపోయింది. ప్రస్తుతం లకారం చెరువు కింద 132ఎకరాల భూమి ఉంది. మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా లకారం చెరువును 2015లో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేశారు, అప్పటి నుంచి ఇక్కడ ఆక్రమణలకు కొద్దిగా తెరపడింది. మినీట్యాంక్ బండ్‌గా మార్చే సమయంలో కొన్ని ఆక్రమణలను మాత్రమే తొలిగించారు. చెరువు భూమి లో 7ఎకరాలను ప్రైవేటు సంస్థలకు 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చారు. అందు లో భవనాలు నిర్మించారు. ఎక్కడైనా చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ గతంలో ప్రభుత్వమే లీజుకు ఇవ్వడంతో నిర్మాణాలు చేపట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో చెరువుల, కుంటలు, వాగులు ఆక్రమణలకు గురయ్యాయి. అయా ఆక్రమణలపై అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. భద్రాచలం, కొత్తగూడెం, పట్టణాల్లో ఈ ఆక్రమణలు జరిగాయి. కొత్తగూడెంలోని చుంచుపల్లిలోని చింతలచెరువు ప్రధాన రహదారికి సమీపంలో ఉంది. 12 ఎకరాల చెరువులో 4ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఆనకట్టకు ఆనుకుని పలు నిర్మాణాలు జరిగాయి. తర్వాత కొందరు అక్రమాలను సక్రమంగా రికార్డులు మార్చుకున్నట్టు ఆరోపణలున్నాయి.

ధంసలాపురం చెరువు కథ అంతే..

ఒకప్పుడు ఖమ్మం నగర సమీపంలో వందల ఎకరాలకు సాగు నీరు అందించిన ఊర (దంసలాపురం)చెరువు ప్రస్తుతం తన ఉనికిని కోల్పోయే స్థితికి వచ్చింది. గొలుసు కట్టు విధానంతో (మిగతా 6వ పేజీలో)





ప్రతీ రోజు ఫాగింగ్ చేపట్టాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 28: వైరల్, సీజనల్, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా ప్రతి రోజు ఫాగింగ్ చేపట్టాలని, మలేరియా, ఎంటమాలజీ విభాగాల అధికారుల పర్యవేక్షణలో కిమోపాస్ పిచికారి జరగాలని, ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించటం ద్వారా దోమల పుట్టకను అరికట్టవచ్చని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. బుధవారం కేఎంసీలో పారిశుధ్య పర్యవేక్షకులు, ఎంట్రమాలజీస్టుల సమావేశంలో కమిషనర్ పలు ఆదేశాలిచ్చారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో టెక్నికల్ గైడెన్స్ పాటించి ఫాగింగ్, కిమోపాస్ పిచికారి చేయాలని సూచించారు. డివిజన్ల వారీగా పారిశుధ్య పనుల తీరుపై సమీక్షించారు. వారంలో రెండు రోజులు డ్రైడేలు చేపట్టాలని సూచించారు. అనంతరం కేఎంసీలోని స్టోర్‌ను తనిఖీ చేశారు. పారిశుధ్యానికి వినియోగించే మందుల నిల్వలను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ అమలు చేయాలి

- పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలి
- పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి
- పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీచేయాలి
- కలెక్టరేట్ ముట్టడించిన ఏఐపీకేఎస్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 28: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఎటువంటి హామీలను ఇచ్చిందో వాటిని బేషరతుగా అమలు చేయాలని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని ప్రకటించి నేటివరకు పూర్తి చేయలేదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు విమర్శించారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు క్వింటాలకు రూ.500 బోనస్, ఉచితంగా బీమా ప్రీమియం, రైతు భరోసా పథకాలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిందని పేర్కొన్నారు. రైతాంగానికి ఇచ్చిన హామీల్ని ఎటువంటి కండిషన్‌లు లేకుండా బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా నేటి వరకు రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వటంలో జాప్యం చేస్తున్నాయని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పోడు సాగుదారులకు పట్టాలను ఇవ్వాలని, అటవీశాఖ అధికారులు గిరిజనులపై చేసే దాడులను ఖండించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ భూముల నుంచి బ్యాంకు రుణాల వరకు ప్రభుత్వమే పూచీకత్తు ఉండి కంపెనీలను ఏర్పాటు చేస్తోందని ఆయా కంపెనీలు దివాలా తీస్తే వాటి బకాయిల్ని రద్దు చేస్తున్నారని, రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మాత్రం ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు కోలేటి నాగేశ్వరరావు, బండెల వెంకయ్య, పాశం అప్పారావు, కేలోత్ లక్ష్మణ్, మారుతి మల్లయ్య, ధరావత్ లక్ష్మణ్, నవీన్, తేజ, అర్జున్‌రావు, పుల్లయ్య, ఝాన్సీ ఆవుల మంగతాయి, దేవ్లా పాల్గొన్నారు. అంతకుముందు ధర్నా చౌక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు

డీసీఎంఎస్ స్థలానికి ఎసరు



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ మేనేజర్

- అనుమతి లేకుండా షాపుల నిర్మాణానికి శ్రీకారం
- పోలీసులకు ఫిర్యాదు.. ముగ్గురిపై కేసు నమోదు
- స్థలం విలువ మార్కెట్‌లో రూ.3కోట్లపైనే...
- మధిరలో పట్టపగలే ఆక్రమణల పర్వం

మధిర టౌన్, ఆగస్టు 28: మధిర నడిబొడ్డున దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే డీసీఎంఎస్ స్థలంలో బుధవారం పట్టపగలు కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా షాపుల నిర్మాణం చేపట్టడం వివాదాస్పదంగా మారింది. వైరారోడ్డులోని జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి సర్వే నెం.41లో 1888 చదరపు గజాల స్థలం ఉంది. ఇందులో గతంలో గోదాము కూడా ఉండేది. ఇదే స్థలంలో కొంత భాగంలో మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌ను తాత్కాలికంగా నిర్మించారు. 2019లో డీసీఎంఎస్ అధికారులు ఈ స్థలాన్ని వేలం వేయటానికి ప్రయత్నించగా కొంత స్థలంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఉండటంతో మిగిలిన 1,555 గజాల స్థలాన్ని వేలం వేశారు. ఆ తరువాత పోలీస్ స్టేషన్‌ను ఖాళీ చేసి స్థలం అప్పగించాలని డీసీఎంఎస్ అధికారులు పోలీసు అధికారులను పలుమార్లు కోరారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో పోలీస్ అధికారులు సమీపంలోని సందరయ్యనగర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోకి స్టేషన్‌ను తరలించారు. ఆ తరువాత కొన్నాళ్లకు ఖాజీపురంలో నూతన పోలీస్‌స్టేషన్ నిర్మించుకుని స్థలాన్ని డీసీఎంఎస్‌కు అప్పగించారు.

దీంతో గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థలం (420 గజాలు)పై కొందరు వ్యక్తుల కన్ను పడింది. ఓపెన్ మార్కెట్‌లో ఈ స్థలం విలువ దాదాపు రూ.3కోట్ల పైనే ఉంటుంది. మునిసిపాలిటీకి చెందిన కొందరి అనుమతితోనే సదరు వ్యక్తులు ఈ నిర్మాణానికి దిగినట్టు తెలుస్తోంది. ప్రధాన రహదారిలో ఉన్న ఈ స్థలం ప్రభుత్వానిదని తెలిసి కూడా షాపులు నిర్మిస్తుంటే మునిసిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. కాగా, అక్రమ నిర్మాణాల విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ కొండ సందీప్ కుమార్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా, డీసీఎంఎస్ స్థలంలో తాము ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వలేదని మునిసిపల్ అధికారులు చెబుతుండటం గమనార్హం.

ఆక్రమణదారులపై కేసు

మధిరలో డీసీఎంఎస్ స్థలంలో షాపుల నిర్మాణానికి యత్నించిన వ్యక్తులపై డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ సందీప్ కుమార్ ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు. మధిర పట్టణానికి చెందిన వీరంశెట్టి కాశేశ్వరరావు, పూసపాటి ఉమామహేశ్వరరావు, మందడపు రామారావులపై 324(4), 329(3), రెడ్‌విత్3(5)సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దతండాకు మహర్దశ

- పలు పంచాయతీలను కలిపి మునిసిపాలిటీ ఏర్పాటుకు కసరత్తు
- ఎన్నెస్పీ కాలువ దిగువ గ్రామాలతో ఏర్పాటు
- ఎం.వి.పాలెం కేంద్రంగా కొత్త మండలం?



పెద్దతండా గ్రామం వ్యూ

ఖమ్మం రూరల్, ఆగస్టు 28: నగర శివారులోని పెద్దతండా (ఖమ్మం రూరల్ మండలం) కేంద్రంగా నూతన మునిసిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అభివృద్ధి, విస్తరణ, జనాభా, ఆదాయం తదితర అంశాల ఆధారంగా పలు గ్రామ పంచాయతీలను కలిపి మునిసిపాలిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. రూరల్ మండలంలో మొత్తం జనాభా 2011 ప్రకారం 81,469 ఉండగా, మొత్తం గ్రామ పంచాయతీలు 31, మొత్తం ఓటర్లు 90,711 వున్నారు. విలీన గ్రామాల్లో 2011 ప్రకారం జనాభా పెద్దతండాలో 9,152, వెంకటగిరి 3,299, బారుగూడెం 1,136, గొల్లగూడెం 1012, గుదిమళ్ల 4,069, మద్దులపల్లి 1,627, ఏదాలాపురం 6,467, గుర్రాలపాడు 1,328, పోలేపల్లి 4,925, ముత్తగూడెం 3,189 ఉన్నారు. రూరల్ మండలంలోని పెద్దతండా, ఏదులాపురం, గుదిమళ్ల, వెంకటగిరి, గుర్రాలపాడు, పాలేపల్లి, గ్రామాలను గతంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడం జరిగింది. అనంతరం ప్రజల నిరసనతో కొంతకాలం తరువాత వాటిని కార్పొరేషన్‌లో నుండి గ్రామ పంచాయతీలుగా మార్చడం జరిగింది. ప్రస్తుతం సదరు విలీన గ్రామాలతోపాటు మద్దులపల్లి, బారుగూడెం, గొల్లగూడెం, ముత్తగూడెం, పల్లెగూడెం, గ్రామాలను కలుపుతు పెద్దతండా కేంద్రంగా మునిసిపాలిటీ చేయనున్నారు.

రూరల్ మండలంలోని పెద్దతండా కేంద్రంగా మునిసిపాలిటీని ఏర్పాటు చేస్తే మద్దులపల్లి గ్రామం కాకుండా ఎన్నెస్పీ కాలువ దిగువ భాగాన్ని మాత్రమే కలిపే అవకాశం ఉంది. గొల్లగూడెం, ముత్తగూడెం, పల్లెగూడెం, రెడ్డిపల్లి గ్రామాలు ఎన్నెస్పీ కాలువ దిగువ భాగంలోనే ఉన్నాయి. దీంతో ఎన్నెస్పీ కాలువ (మిగతా 6వ పేజీలో)



భద్రాచల రామాలయంలో ఉట్టి కొడుతున్న దృశ్యం

ఉత్సాహంగా ఉట్ల పండుగ

భద్రాద్రి రామాలయంలో సందడే సందడి

భద్రాచలం, ఆగస్టు 28: వైష్ణవ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఉట్ల పండగను ఆహ్లాదకరంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి లాలలు, జోలలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించిన అర్చకులు ముందుగా దర్బారుసేవ నిర్వహించి అనంతరం చిత్రకూట మండపం వద్ద ఉట్ల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి లక్ష్మణస్వాములను మేళతాళాలతో తిరువీధి సేవకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా భక్తులు, చిన్నారులు ఆహ్లాదకరంగా ఆ కార్యక్రమాన్ని తిలకించారు. ఇదిలా ఉండగా రాజు కుటుంబసభ్యులు ఈ ఉట్లు కొట్టే కార్యక్రమంలో నాలుగు దశాబ్దాలుగా పాల్గొంటుండటం విశేషం. కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదం

- ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించిన భద్రాద్రి కలెక్టర్
- ఖమ్మం, కొత్తగూడెం ప్రకాశం మైదానంలో కొనసాగుతున్న క్రీడలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 28: ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదపడతాయని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. బుధవారం కొత్తగూడెం ప్రకాశం మైదానంలో ముందస్తుగా అంతర్జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు సందర్భంగా ప్రతీ ఏటా జాతీయ క్రీడా ఉత్సవంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు విధుల నిర్వహణలో తీవ్ర ఒత్తిడి కి గురవుతున్నారని, వాటి నుంచి ఉపశమనం పొందేందుకు రెండు రోజుల పాటు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం డీవైఎస్‌వో కార్యాలయ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీవైఎస్‌వో పరంధామరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్టెల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు, సంఘం సభ్యులు భట్టు ప్రేమ్‌కుమార్, వాసిరెడ్డి నరేష్‌కుమార్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అమరనేని రామారావు, సంఘం వెంకట పుల్లయ్య, వివిధ క్రీడా అసోసియేషన్ సభ్యులు సిహెచ్ గోపికృష్ణ, మహీధర్, మొగిలి పాల్గొన్నారు.


ఖమ్మంలో టగ్‌ఆఫ్ వార్‌లో మహిళా ఉద్యోగులు

జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి :
అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న ఉద్యోగుల క్రీడా పోటీల సందర్భంగా ఆయన హాజరై చెస్, టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అధునాతన క్రీడాపరికరాలను సమకూర్చడమే కాకుండా, అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తానన్నారు.

హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29) సందర్భంగా నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో బుధవారం ప్రభుత్వఉద్యోగులకు క్రీడాపోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. పోటీలను జిల్లా అడిషనల్ కలెక్టర్(ట్రైనీ) మ్రిణాల్ శ్రేష్ఠ, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుంచి సుమారు 500మంది ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలో ఉద్యోగులకు 13 విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీలను టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, సెక్రెటరీ వేలాద్రి, టీఎన్‌జీవోస్ అడ్‌హాక్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిక్కు, స్టేడియం కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, సురేష్, వోలేటి సాంబమూర్తి తదితరులు సమీక్షించారు.


క్రీడలను ప్రారంభిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

కొత్తగూడెం డిపోను సందర్శించిన ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 28: కొత్తగూడెం డిపోను కరీంనగర్ జోన్ ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. డిపోలో వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బస్టాండ్ పరిసరాలను నిశితంగా పరిశీలించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. అనంతరం గ్యారేజ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. కార్యక్రమంలో ఈడీ వెంట ఉమ్మడి జిల్లాల ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాంనాయక్, డిప్యూటీ ఆర్‌ఎం భవానీ ప్రసాద్, పవిత్ర, కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

పెద్దతండాకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

హద్దుగా చేసుకుని మునిసిపాలిటీ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నెస్పీ కాలువ అవతల గ్రామాలు, కాలువ ఇవతల భూములు ఉండనున్నాయి. వాటిపై అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

ఎంవీ పాలెం కేంద్రంగా కొత్త మండలం?

ఖమ్మం జిల్లాలోనే అతిపెద్ద మండలంగా ఉన్న ఖమ్మం రూరల్ మండలం రెండుగా విడిపోనున్నట్టు తెలుస్తోంది. విలీన పంచాయతీలతో పాటు మరో నాలుగు గ్రామాలను కలిపి పెద్దతండా కేంద్రంగా మునిసిపాలిటీని ఏర్పాటు చేసి, ఎం వెంకటాయపాలెం కేంద్రంగా మరో మండలాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. అలాగే యంవీ పాలెం గ్రామంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలపరిశీలన కూడా జరిగినట్లు తెలిసింది. మొత్తం 31 గ్రామ పంచాయతీలలో 10 పంచాయతీలు మునిసిపాలిటీలో కలిపితే మిగిలిన 21 గ్రామ పంచాయతీలతో యం వెంకటాయపాలెం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు కానుంది.

జిల్లాలో రైతు కుటుంబ నిర్ధారణపై పరిశీలన

- 1087 రైతు కుటుంబాల వివరాలు యాప్‌లో నమోదు
- జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 28: జిల్లాలో రుణమాఫీ సమస్యల పరిష్కారానికి రైతు భరోసా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించిందని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలిపారు. బుధవారం జిల్లాలో 1087 రైతు కుటుంబాల నుంచి వివరాలు సేకరించి రైతు భరోసా యాప్‌లో నమోదు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 23వేల మంది రైతుల వివరాలను రైతు భరోసా యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిలాలో అర్హులైన రైతులు సాంకేతిక సమస్యలు, ఆధార్‌కార్డులు, కుటుంబనిర్ధారణ, పట్టాదార్ పాస్‌పుస్తకం తదితర సాంకేతిక సమస్యలతో రుణమాఫీ కాలేదని వీరందరు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాఫీ వర్తించని రైతుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమాచారం తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు సంబంధిచిన ఆధార్ రుణఖాతాలో వేర్వేరుగా ఉండటం, పట్టా పాస్‌పుస్తకం లేకపోవడం, 2023డిసెంబరు9 నాటికి బకాయి ఉన్న వడ్డీ ఎక్కువ ఉండటం తదితర సాంకేతిక సమస్యలతో కూడిన మొత్తం 32 అంశాలు పరిశీలించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతురుణమాఫీకీ అర్హులైన రైతులందరు వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి రైతుభరోసా యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ డీలర్లకు యూరియా కేటాయించండి...

కలెక్టర్‌కు డీలర్ల వినతి

ఇల్లందు. ఆగస్టు 28: జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో యూరియా లభ్యం కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. ప్రైవేట్ డీలర్లకు యూరియా కేటాయించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను జిల్లా డీలర్ల సంఘం ఆధ్వర్యంలో కోరారు. బుధవారం జిల్లా ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాల్ల సోమసుందర్ ఉపాధ్యక్షుడు వంకాయలపాటి రామలింగయ్య. కార్యదర్శులు దుర్గాప్రసాద్. నాగేశ్వరరావు ప్రవీణ్ రమేష్ తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ఇల్లెందు టేకులపల్లి. ఆళ్లపల్లి. గుండాల, పినపాక తదితర మండలాల్లో మొక్కజొన్న, వరి, మిర్చి పంటలు అధికంగా సాగు చేస్తున్నారని. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతులను ఆదుకునేందుకు డీలర్లకు యూరియా సరఫరా చేయించాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

మాకు న్యాయం చేయండి

- పట్టాభూమి ఆక్రమించి గుడిసెలు వేశారు
- తొలిగించమంటే దౌర్జన్యం చేస్తున్నారు

ఖమ్మంటౌన్, ఆగస్టు 28: తన పట్టా భూమిలో గుడిసెలు వేసి తొలిగించమంటే దౌర్జన్యం చేస్తున్నారని భూయజమాని వేజెళ్ల సురేష్ కుమార్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 148, 149 సర్వేనెంబర్లలో భూమి తమదని, తామే భూయజమానులమని వేజెళ్ల సురేష్, దిరిశాల వెంకటేశ్వర రావు, బండి జయకిషోర్‌లు మాట్లాడారు. కొంతమంది స్థానికేతరులు పేదల ముసుగులో అరాచకశక్తులను పోగేసి పట్టాభూములు ఆక్రమిస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తాము పోతుల వెంకటేశ్వర్లు, సతయ్య అనే వ్యక్తుల వద్ద భూమి గతంలో కొనుగోలు చేశామని, ప్రభుత్వానికి రూ.30లక్షలు చలాన రూపంలో చెల్లించి లేఅవుట్ అనుమతులు తీసుకున్నామని భూదాన్ ల్యాండ్ పేరుతో భూములు ఆక్రమించిన స్థానికేతరులు తమపట్టా భూమిలో గుడిసెలు వేసి విక్రయిస్తూ ఇదేమని అడిగితే అసాంఘికశక్తులతో దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికి రెండుసార్లు తమ వాహనాలను ధ్వంసం చేశారని, భూదాన్ ట్రస్టు బోర్డు పేరుతో ఫోర్జరీ పట్టాలు సృష్టించి పేదల పేరుతో లక్షల రూపాయల దోచుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు పూర్తిగా విచారణ చేసి తమ భూమికి రక్షణ కలిపించాని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఈతీర్పును రెవెన్యూ, పోలీసు అధికారులు అమలుచేసి తమ పట్టాభూమిలో వేసిన గుడిసెలను తొలిగించాలని కోరారు. ఇప్పటికే అధికారులు తీవ్ర జాప్యం చేయడంతో తాము ఆర్థికంగా నష్టపోయచామని, ఇకనైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.ప్రైవేటు భూములకు రక్షణ లకలిపంచాలని లేకుంటే ఇంకా ఆక్రమణలు పెరిగే ప్రమాదం ఉందని వారు వివరించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూ యజమాని వేజెళ్ల సురేష్

బకాయిలు చెల్లించండి మహాప్రభో

విద్యుత్‌శాఖ అధికారుల వేడుకోలు

పాల్వంచ టౌన్, ఆగస్టు 28: పెండింగ్ విద్యుత్ బకాయిలు చెల్లించండి మహాప్రభో అని విద్యుత్‌శాఖాధికారులు, మున్సిపల్ శాఖ అధికారులను వేడుకోవడం కొసమెరుపు. రెండు ప్రభుత్వ శాఖలే కావడంతో పాల్వంచ మునిసిపాలిటీ విద్యుత్‌శాఖకు సుమారు రూ.3.80కోట్లు బకాయి పడ్డా విద్యుత్‌శాఖాధికారులు ఉదాసీనతతో వ్యవహరించారు. అదే మరో ఏదైన ప్రైవేట్ సంస్థనో, మరేదో శాఖ అయితే ఆ శాఖాధికారులు వ్యవహరించే తీరు మరో విధంగా ఉండేది. అయితే ఈ పెండింగ్ బిల్లులు చెల్లించాలని బుధవారం విద్యుత్ శాఖాధికారులు మునిసిపల్, అధికారులతో మంతనాలు జరిపారు. మునిసిపాలిటీ నుంచి పంపుహౌస్ బిల్లులు సుమారు రూ.2.90కోట్లు, స్ట్రీట్‌లైట్స్ తదితర బిల్లులు సుమారు కోటి మొత్తంగా సుమారు రూ.3.80కోట్లు మునిసిపల్ శాఖ నుంచి రావాల్సి ఉందని విద్యుత్‌వాఖ ఏడీఈ లక్ష్మణ్ 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తెలిపారు. దీనిలో కొంత మేర మునిసిపాలిటీ వారు చెక్కుల ద్వారా చెల్లించిన ట్రెజరీలో అవి పాస్‌కాకపోవడంతో బకాయితోపాటు ఫైనాల్టీ కూడా తోడవడంతో మరింత భారంగా మారింది.

బిల్లుల చెల్లింపుపై మునిసిపల్ అధికారులు వివరణకోరగా.. రూ.22లక్షల వరకు చెక్కులు ఇచ్చిన అవి ట్రెజరీతో పాస్ కాలేదన్నారు. విద్యుత్‌శాఖకు బకాయిలు పట్టణ ప్రగతి నిధుల విడుదల జాప్యంతో చెల్లించడంలో ఆలస్యం జరిగింది వాస్తవమన్నారు. త్వరలో బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యుత్‌శాఖ సీనియర్ అకౌంట్ ఆఫీసర్ మురళీ, ఏడీఈ లక్ష్మణ్, అసిస్టెంట్ ఎకౌంట్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, మునిసిపల్ డీఈ స్వరూపరాణి, మేనేజరు ఎల్‌వి.సత్యనారాయణ, అకౌంట్ సెక్షన్ అధికారి స్వప్న, రాంబాబు పాల్గొన్నారు.

'రైతు భరోసా, పంటల బీమా వెంటనే అమలుచేయాలి'

ఖమ్మంటౌన్, ఆగస్టు28: రైతుభరోసా, సమగ్ర పంటల బీమా పథకాన్ని వెంటనే అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని సుదర్శనరావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమై నాలుగుమాసాలవుతున్నప్రభుత్వం ఈపథథకాలు అమలుచేయడంలో విఫలమైందన్నారు.పెట్టుబడులు అందక రైతులు ఆందోళన చెందుతున్నార న్నారు. పంటలు దిగుబడిప ఇది ప్రభావం చూపుతుందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం తెచ్చిన కిసాన్ సమ్మాన్ యోజన రైతులకు ఉపయోగపడడంలేదని, కంపెనీలకు మాత్రమే లాభం చేస్తుందన్నారు.

తెలంగాణలో సమగ్ర పంటల బీమా పథకాన్ని రూపొందించాలన్నారు. డెంగీ, మలేరీయి, విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి వైద్యసేవలు విస్తృతపరచాన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబరు రెండో వారంలో సత్తుపల్లిలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజా ఉద్యమాల రూపకల్పన జిల్లలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరచడం, తదితర అంశాలను ఈమహాసభల్లో చర్చిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పొన్నం వెంకటేశ్వర రావు, మాచర్ల భారతి, బండి రమేస్, వై.విక్రం, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు పాల్గొన్నారు.

భూముల హద్దులు తేల్చాలి

వినోభా నవోదయ కాలనీ వాసులకు న్యాయం చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు 28: వెలుగుమట్ల సమీపంలోని భూదాన్ భూములకు హద్దులు పెట్టి వినోభా నవోదయ కాలనీ వాసులకు న్యాయం చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడారు. వినోభా నవోదయ కాలనీలో కొన్నేళ్లుగా భూదాన్ బోర్డు ఇచ్చిన వంద గజాల ప్రొసీడింగ్స్ ఆధారంగా పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. కరెంట్ లేక, మంచినీటి సౌకర్యాలు లేక సమస్యలతో వందలాది కుటుంబాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కాగా కొందరు వ్యక్తులు పలు ఆధారాలు చూపిస్తూ తమభూమిగా మాపైకి పోలీసులతో వస్తున్నారని తెలిపారు. వెంటనే తమపై దౌర్జన్యం చేసి దాడులుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని తమకు మౌళిక వసతులు కలిపించి భూదాన్ భూమికి హద్దులు కలిపించాలని కోరారు. ప్రైవేటు వ్యక్తులు అందరిపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులకు భూధాన్ భముల సరిహద్దులు తేల్చి , ప్రైవేటు భూములు ఎక్కడున్నాయో, భూదాన్ భూముల హద్దులు చూపించాల్సిన బాధ్యత ఉందని, ఈవిషయంలో అదికారులు చొరవ తీసుకని న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈవిలేకరుల సమావేశంలో ఓపీడీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల లక్ష్మణాచారి, జిల్లా కమిటీ సభ్యులు కొప్పెర వెంకన్న, ముడిగె రాములు, చొప్పదండి బాలకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దండా లింగయ్య

శేషం రాధాకృష్ణమూర్తి ఇక లేరు

భద్రాచలం, ఆగస్టు 28: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం విశ్రాంత హరిదాసు శేషం రాధాకృష్ణమూర్తి(93) వయోభారంతో బుధవార ఆయన స్వగృహంలో మృతి చెందారు. భద్రాచలంలోని రంగనాయకులగుట్టపై ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధిస్తూనే మరో వైపు భద్రాద్రి రామచంద్రమూర్తికి జరిగే సేవల్లో పాల్గొనే భాగ్యం ఆయనకు దక్కింది. స్వామి వారికి కీర్తన సేవ చేస్తూ తన జీవితాన్ని చరితార్థం చేసుకున్నటువంటి ధన్యజీవి రాధాకృష్ణమూర్తి అని అంటారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా భద్రాద్రి దేవస్థానంలో నాటితరం వైదిక, పరిపాలన సిబ్బందికి పాఠాలు సైతం ఆయన బోధించడం విశేషం.

ఐదు దశాబ్దాలుగా రామయ్య సేవలో

శేషం రాధాకృష్ణమూర్తి మాష్టారు హరిదాసుగా ఐదు దశాబ్దాల పాటు భద్రాద్రి రామయ్య సేవలో తరించారు. 1960 దశాబ్దం చివర్లో ఆయన భద్రాద్రి రామాలయంలో హరిదాసులుగా సేవలు ప్రారంభించినట్లు ఆనాటి తరం వారు పేర్కొంటున్నారు. అలాగే తూము నరసింహదాసు ఏర్పాటు చేసిన దశవిధ ఉత్సవాలకు సంబంధించి విధానాలను తెలియజేసే ప్రకరణల గ్రంథాన్ని ముద్రించడంలో తమవంతు సహాయ సహకారాలను ఆనాడు రాధాకృష్ణమూర్తి మాష్టారు అందించారని వారు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి హరిదాసులకు కూడా వారే మార్గదర్శి. కాగా భద్రాద్రి దేవస్థానంలో వైదిక పర్యవేక్షణ చేసే ఐదుగురు స్థానాచార్యులతో కలిసి పని చేసే భాగ్యం తనకు దక్కిందని ఆయన పలుమార్లు పేర్కొనేవారు. రాధాకృష్ణమూర్తికి ఇద్దరుకుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాధాకృష్ణమూర్తి మాష్టారు మృతి పట్ల భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, దేవస్థానం, వైదిక పరిపాలన సిబ్బంది సంతాపం తెలిపారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భక్తరామదాసు తీసుకొచ్చిన హరిదాసు వ్యవస్థలో వంశపారంపర్య వవస్థలో ఆఖరివారు.

చెరువుల చెర

(5వ పేజీ తరువాయి)

ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీరు చేరుతూ చివరికి వరద మున్నేరుకు వెళ్లేలా కాకతీయుల కాలంలోనే ఖమ్మంలో చెరువులు నిర్మించారు. ఖమ్మం నగరం విస్తరించటంతో రియల్ మాఫియా చూపు దంసలాపురం ఊర చెరువుపై పడింది. ఇంకేముంది రెండు దశాబ్ధాల క్రితం 120ఎకరాలు ఉన్న దంసలాపురం ఇప్పుడు 40ఎకరాలకు కుంచించుకుపోయింది. గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న నాయకులు చెరువు భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో దంసలాపురం చెరువు నుంచి మున్నేరులోకి వెళ్లాల్సిన వరద నీరు ఖమ్మం నగరం శివారు డివిజన్లలోని నివాసాలపై పడి ముంచేస్తోంది. నగరానికి అనుబంధంగా ఉన్న చెరువుల్లో దంసలాపురం చెరువు చాలా పురాతనమైంది. రఘునాథపాలెం, బాలపేట, బల్లేపల్లి నుంచి వచ్చే ఊట నీరు లకారం చెరువు నుంచి దంసలాపురానికి ఊట నీరు చేరుతోంది. మరో వైపు పుట్టకోట, రుద్రంకోట, వెలుగుమట్ల ప్రాంతాల నుంచి వరద నీరు దంసలాపురానికి చేరుతోంది. దీంతో ఇది ఊర చెరువుగా ఖ్యాతి పొందింది. ప్రస్తుతం ఈ చెరువు భూమి రియల్ ఎస్టేట్ ఆక్రమణలతో కుంచించుకుపోయింది. కొన్నిచోట్ల భవనాలు కూడా నిర్మించారు. ఇక నగర సమీపంలోనే గొల్లగూడెం చెరువు సుమారు 200ఎకరాలుండగా 30ఎకరాల వరకు రైతులు ఆక్రమించారు. గతంలో జీవో-59కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తుచేయగా రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. ఖమ్మం సమీపంలోని ఖానాపురం చెరువు 72 ఎకరాలుండగా ప్రస్తుతం 32 ఎకరాలే మిగిలింది. 32 ఎకరాల శిఖం భూమిలో రియల్ వెంచర్లు వేసి ఇళ్లు నిర్మించారు. మిగిలిన భూములు కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించగా అధికారులు ధ్వంసం చేశారు. కానీ ఈ చెరువుకు హద్దులు మాత్రం పెట్టడం లేదు. కాగా మండల కేద్రం రఘునాథపాలెం చెరువు 21 ఎకరాల్లో ఉండగా అందులో 10 ఎకరాలకు పైగా గతంలో ప్లాట్లువేసి విక్రయించగా వాటిని అధికారులు రద్దుచేశారు.

ఏదులాపురం చెరువులో ఆక్రమణలు..

ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం ఈదుల చెరువు ఆక్రమణలకు గురైంది. రియల్ వ్యాపారులు శిఖం భూమిని ఆక్రమించి మట్టితో నింపి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారు. ఈ చెరువు మొత్తం వంద ఎకరాల్లో ఉండాలి. దీని కింద 340 ఎకరాల ఆయకట్టు ఉండేది. రియల్ ఆక్రమణలతో నేడు సుమారు వంద ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉంది. అదే విధంగా ఏదులాపురంతో పాటు పెద్దతండా, గుర్రాలపాడులోని పంటపొలాకు ఈ చెరువునుండే సాగునీరందుతోంది. రియల్ వెంచర్ల పుణ్యమా అని నేడు ఈ చెరువు సుమారు 70 ఎకరాలకు మిగిలింది. 30 ఎకరాలు అన్యాక్రాంతమైంది.

కల్లూరు పాయపూర్ చెరువులో..

కల్లూరు మండలం పాయాపూరు గ్రామంలో ఊరచెరువు శిఖం భూమికి సంబంధించి రెవెన్యూశాఖ అధికారుల అండదండలతో కొంతమంది వ్యక్తులు అక్రమంగా శిఖం భూమిని ఆక్రమించటమే కాకుండా ప్రభుత్వం తరుపున పట్టాదారు పాస్ పుస్తకాలు పొందారు. అంతే కాకుండా రైతుబంధు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు, బ్యాంకుల్లో రుణాలు కూడా పొందుతున్నారు. ఈ చెరువు పరిధిలో సర్వే నెం 242 ప్రకారం సుమారు 140ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. (ఎఫ్‌టీఎల్ సామర్థ్యం) అయితే చెరువు పరిధిలో పట్టా కలిగి ఉన్న కొంతమంది రైతులు కాల క్రమంలో చెరువు శిఖం భూమిపై కన్నేశారు. దీంతో ఎనిమిది సంత్సరాల క్రితం అప్పటి తహసీల్దార్‌తో పాటుగా నాటి వీఆర్వోకు ఆక్రమణదారులు భారీగా ముడుపులు ముట్టజెప్పి తమ కుటుంబసభ్యుల పేర్ల మీదగా పట్టా పుస్తకాలు పొందారు. ఇలా పదిమంది సగటున తమ పేరు మీద 5 ఎకరాల భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారన్న విషయం కూడా వెలుగులోకి వచ్చింది. సుమారు 50ఎకరాల చెరువు భూమి ఆక్రమణకు గురైంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోను ఇదే తంతు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో చెరువుల, కుంటలు, వాగులు ఆక్రమణలకు గురయ్యాయి. ఆయా ఆక్రమణలపై అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. భద్రాచలం, కొత్తగూడెం, పట్టణాల్లో ఈ ఆక్రమణలు జరిగాయి. కొత్తగూడెం పట్టణంలోని చుంచుపల్లిలోని చింతలచెరువు ప్రధాన రహదారికి సమీపంలో ఉంది. 12 ఎకరాల చెరువులో 4ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఆనకట్టకు ఆనుకుని కొందరు చెరువు భూములు ఆక్రమించడంతో పలు నిర్మాణాలు జరిగాయి. తర్వాత కొందరు అక్రమాలను సక్రమంగా రికార్డులు మార్చుకున్నట్టు ఆరోపణలున్నాయి.

భద్రాచలం చెరువులో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

సాధారణంగా చెరువులను ఎవరైనా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల అండతో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తుంటారు. కానీ భద్రాచలంలో ఓ చెరువును గత ప్రభుత్వం ఆక్రమించి డబుల్‌బెడ్‌రూ ఇళ్లు నిర్మించింది. భద్రాచలం పట్టణానికి ఉన్న ఏకైక చెరువు ఇదే. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఈ చెరువు భూముల్లోనే నిర్మించారు. భద్రాచలంలోని ఐటీడీఏ వెనుకభాగంలో గతంలో 12ఎకరాల్లో మనుబోతుల చెరువు ఉండేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం కూడా అక్కడ చెరువు ఉంది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా విడతలవారీగా ఆ చెరువు ఆక్రమణకు గురవుతూ వచ్చింది ఈ క్రమంలో ప్రస్తుతం మనుబోతుల చెరువు స్థానంలో అక్కడ ఒక కాలనీ వెలసింది. రెండు ఎకరాలకు పైగా ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు కేటాయించింది. దీంతో నాడు 12 ఎకరాల్లో విస్తరించి ఉన్న మనుబోతుల చెరువు నేడు నాలుగున్నర ఎకరాలకు పరిమితమైంది. ఇక్కడ 160 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ప్రస్తుతం అవి అసంపూర్తిగానే ఉన్నాయి. చెరువుభూముల్లో నిర్మాణం చేపట్టడంతో చెరువు ఉనికి దెబ్బతిన్నది.

ప్రయోగాలకు దక్కిన ఫలితం

- జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పెసర ప్రభాకర్‌రెడ్డి ఎంపిక

ఖమ్మం ఖానాపురం హవేలి/తిరుమలాయపాలెం, ఆగస్టు 28: తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెసర ప్రభాకరరెడ్డి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు- 2024కు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఈ అవార్డుకు ఎంపికవ్వగా వారిలో ప్రభాకరరెడ్డి ఒకరు. గల్లీనుంచి ఢిల్లీస్థాయికి ఎదిగిన ప్రభాకర్‌రెడ్డి రైతు కుటుంబంలో జన్మించారు. ఉమ్మడి జిల్లా బయ్యారం మండలం ఇర్సులాపురంలో పెసల పిచ్చిరెడ్డి, శశిరేఖ దంపతులకు 4వ సంతానంగా జన్మించిన ఆయన బయ్యారంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్ బయ్యారం ప్రభుత్వ కళాశాలలో, డిగ్రీ ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్‌లో చదివారు. 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించారు. బయాలజీ టీచర్‌గా ప్రభాకర్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల, బయ్యారం, గుండాల, అశ్వాపురం, బూర్గంపాడు, కామేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 27 ఏళ్లపాటు పని చేశారు.

పనిచేసిన ప్రతీచోట గుర్తింపు

ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కృషిచేయాలనే తపనతో ప్రభాకర్‌రెడ్డి తాను పనిచేసిన ప్రతీ చోట గుర్తింపు సాధించారు. నేటి వరకు ప్రభుత్వ విద్య బలోపేతానికి శ్రమిస్తునే ఉన్నారు. ప్రస్తుత తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠాలు బోధించడంతో ఆయన ప్రయోగాత్మకంగా వ్యవహరిస్తారు. ఆయన ఐదు నేషనల్ సెమినార్లు, ఆరు రాష్ట్రస్థాయి సెమినార్లలో పాల్గొన్నారు. ఓపెన్ టెన్త్‌కు సంబంధించి నాలుగు పాఠ్యపుస్తకాల రచనలో పాలుపంచుకున్నారు. ఉపాధ్యాయ శిక్షణల కోసం 9 మాడ్యూల్స్ రాశారు.

పొందిన అవార్డులు

2008లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2016-18లో రాష్ట్రస్థాయిలో ఎస్‌ఎఫ్‌టీడబ్ల్యూ ఉత్తమ అవార్డు అందుకున్నారు. 2024 జాతీయ ఉత్తమ అవార్డు లభించింది. ఈ సందర్భంగా టీచర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. తాను చదువుకోసం రోజు 7కి.మీ. నడిచి వెళ్లేవాడినని తెలిపారు. జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవ్వడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులకు సైన్స్‌ను జీవనశైలిలో భాగంగా చేసేలా ప్రయత్నిస్తానన్నారు. ఇందుకోసం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి ప్రతి ఒక్క విద్యార్థి ప్రయోగాలు చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

అమ్మో.. 'ధరణి' ఆపరేటర్!

- మళ్లీ కల్లూరు డివిజన్‌లో పోస్టింగ్
- గతంలో అక్రమాలు, ఆరోపణలతో బదిలీ
- అధికార పార్టీ ఒత్తిడితో తిరిగి పోస్టింగ్
- తలలు పట్టుకుంటున్న అధికారులు, రైతులు

సత్తుపల్లి, ఆగస్టు 28: రెవెన్యూ కార్యాలయంలో ధరణి సెక్షన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఒక ఉద్యోగికి కల్లూరు రెవెన్యూ డివిజన్‌లోని ఒక మండల రెవెన్యూ కార్యాలయంలో పోస్టింగ్ ఇవ్వటంతో అధికారులు, రైతులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో అదే కార్యాలయంలో పని చేసిన సదరు ఆపరేటర్ చేతి వాటినికి వందల సంఖ్యలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య తీసికెళ్లటంతో ఆపరేటర్‌ను ఈ డివిజన్‌లోని రెవెన్యూ కార్యాలయం నుంచి వేరే మండల రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేసారు. రైతులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాని మళ్లీ ఇప్పుడు అదే రెవెన్యూ కార్యాలయంలో పోస్టింగ్‌తో తిరిగి రావటంతో తమ భూములపై హక్కులు కోల్పోతామనే ఆందోళనలో ఉన్నారు.

ఈ ఆపరేటర్ కల్లూరుడివిజన్‌లోని ఒక కార్యాలయంలో పని చేసిన సమయంలో ధరణిలో లొసుగులను అడ్డుపెట్టుకొని పలు అక్రమాలకు పాల్పడ్డాడు. ఒకరి భూములను మరొకరి పేరుతో నమోదు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఒక రైతుకు రికార్డుల్లో భూమి విస్తీర్ణం ఎక్కువగా నమోదైందని రెవెన్యూ కార్యాలయానికి పిలిపించి, ఎక్కువ విస్తీర్ణం తగ్గించకుంటే మొత్తం విస్తీర్ణం నిషేధిత జాబితాలో పెట్టాల్సి వస్తుందని నమ్మించాడు. అదనంగా ఉన్న విస్తీర్ణం తొలగిస్తానని చెప్పి ధరణిలో లొసుగులు ఆసరా చేసుకొని అతని వేలిముద్రలు, ఫొటోలు తీసుకొని మొత్తం విస్తీర్ణం భూమి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన అప్పట్లో సంచలనంగా మారింది. దీనిపై అప్పట్లో ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వెలువడ్డాయి. పత్రికల్లో కథనాలు వస్తే ఇబ్బంది పడతారని, మీకే నష్టమంటూ బాధిత రైతులను ఆపరేటర్ ఫోన్‌లో బెదిరించగా వాయిస్ రికార్డింగ్ కూడా అప్పట్లో వైరల్ అయింది. దీంతో అధికారులు స్పందించి బాధిత రైతు భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయించాల్సి వచ్చింది. అనేక గ్రామాలకు చెందిన రైతులు సదరు ఆపరేటర్ అక్రమాలకు బలయ్యారనే ఆరోపణలు వెల్లు వెత్తాయి.

ఈ ఆపరేటర్ అక్రమాలను రెవెన్యూ డివిజనల్ అధికారి ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లటంతో ఖమ్మం డివిజన్‌కు మార్చారు. కొంత కాలంగా మళ్లీ ఈ డివిజన్‌లోని అదే రెవెన్యూ కార్యాలయానికి రావాలని ఆపరేటర్ ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆపరేటర్ ప్రయత్నాలకు అధికారుల పార్టీ నాయకులు కూడా సహకరించటంతో పోస్టింగ్ సులభంగా మారిందని చెపుతున్నారు. అధికార పార్టీ ప్రమేయం ఉండటంతో సదరు ఆపరేటర్‌కు జిల్లా అధికారులు పోస్టింగ్ ఇచ్చారని చెపుతున్నారు.

సదరు ఆపరేటర్ తిరిగి అదే రెవెన్యూ కార్యాలయంలో చేరటంతో అధికారి కూడా కంగు తిన్నారు. ఆపరేటర్ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అతని బదిలీని రద్దు చేయాలని కోరినట్లు తెలిసింది. రాజకీయ పలుకుబడి కలిగిన ఆపరేటర్ విషయంలో జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారోనని మండల రైతులు ఎదురు చూస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 28: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట మండలంలోని మందలపల్లికి చెందిన చిందిరాల రఘురాం(34) తాపీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. తన ద్విచక్ర వాహనంపై ఆంధ్రాలోని కన్నాపురం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో నారంవారిగూడెం కాలనీ సమీపంలో ఢిల్లీ నుంచి రాజమండ్రికి ఎలక్ట్రికల్ గూడ్స్‌తో వెళుతున్న లారీ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

దమ్మపేట, ఆగస్టు 28: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. దమ్మపేటకు చెందిన శేషగిరి నాగేశ్వరరావు(63) అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై మల్లారం రోడ్డు నుంచి దమ్మపేట రోడ్డుపైకి వస్తుండగా పాల్వంచ వైపు శీతలపానియాలతో వెళుతున్న డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదం అనంతరం లారీ డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపునకు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ...

బోనకల్, ఆగస్టు 28: మండలంలోని మోటమర్రి, బోనకల్ రైల్వే స్టేషన్ల మధ్య గల రైల్వే ట్రాక్ పై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. దాదాపు 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకి గుర్తించడానికి గానూ ఎటువంటి ఆదారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో గల మార్చురికి తరలించారు. ఈ సంఘటన పై రైల్వే ఎస్‌ఐ బాస్కర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు నుంచి కింద పడిన మహిళ

● తీవ్ర గాయాలు ● నేలకొండపల్లిలో ఘటన

నేలకొండపల్లి, ఆగస్టు28: కదులుతున్న బస్సు నుంచి దిగటానికి ప్రయత్నించి కింద పడి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో జరిగింది. వివరాల ప్రకారం.. చెర్వుమాధారానికి చెందిన సురబు సుశీల ఖమ్మం వెళ్లటానికి నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో బస్సు ఎక్కింది. బస్సు కదిలే సమయంలో ఆమెకు సంబంధించిన వారు బస్సు ఎక్కలేదని గమనించి, దిగటానికి ప్రయత్నించింది. అప్పటికే బస్సు కదలడం, డ్రైవర్ గమనించక పోవడంతో ఆమె కింద పడిపోయింది. దీంతో తీవ్ర గాయాలైనట్లు సమాచారం. నేలకొండపల్లి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం 108లో ఖమ్మం తరలించారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మణుగూరు, ఆగస్టు 28: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని బాపన కుంట గ్రామానికి చెంది న జీ. శివ(26) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు ప్రకారం.. మండలంలోని విప్పల సిం గారంగ్రామానికి చెందిన శివకు వివాహం అయిం ది. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా బుధవారం బాపన కుంట గ్రామంలో నివాసముండే అత్తగారి ఇంటిలో ఉరేసుకొని మృతి చెందాడు. కుమారుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులను ఢీ కొట్టిన కారు

● భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

ఖమ్మం రూరల్, ఆగస్టు 28: ఓ కారు సృష్టించిన బీభత్సంతో ఒకరు మృతి చెందగా, మరొకరు ప్రాణాపా య స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. ఈ సంఘటన ఖమ్మం రూరల్ మండలం, రెడ్డిపల్లి వద్ద ఓ ఫంక్షన్ హల్ లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని యం. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నిదిగొండ పెద్ద భిక్షం (50), వరలక్ష్మి దంపతులు ఇద్దరు రెడ్డిపల్లి మారెమ్మ ఆలయ ప్రాంతంలోని ఓ ఫంక్షన్ హల్లో వాచ్‌మెన్‌గా, స్లీపర్‌గా పనిచేస్తుంటారు. దాంతో పాటు ఫంక్షన్‌హలో ముందు షోడా బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అయితే బుధవారం ఫంక్షన్ హల్ వద్ద దంపతులిద్దరు పనిలో నిమగ్నమై ఉన్నారు. అదే సమయంలో ఖమ్మం నుంచి కొరివి వైపు వెళుతున్న కారు అతివేగంతో వచ్చి ఫంక్షన్ హల్లోకి దూసుకె ళ్లింది. ఫంక్షన్ హల్ ముందు పని చేసుకుంటున్న దంపతులను అతివేగంతో కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ భిక్షం మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన వరలక్ష్మి చికిత్స పొందుతుంది. ఆమె పరిస్థితి వషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన మహిళ పై కేసు

మధిరటౌన్,ఆగస్టు28: మధిర ఎస్సీ కాలనీకి చెందిన తోటపల్లి రమ తన ఇంటి పక్కన ఉండే కావు స్రవంతి పై దాడి చేసిన సంఘటనలో స్రవంతి ఫిర్యాదు మేరకు రమపై బుధవారం కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్‌ఐ సంధ్య తెలిపారు. ఇరువురి ఇంటి మధ్యన ఉన్న గోడను రమ ధ్వంసం చేయడంతో ప్రశ్నించిన స్రవంతి పై రాయితో దాడి చేసిందని పేర్కొన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

ఖమ్మం క్రైమ్ ఆగస్టు 28: గుర్తు తెలియని వ్యక్తులు నిలిపి ఉన్న ఆటోకు నిప్పంటించిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. నిజాంపేటలో నివసించే కట్ల స్థాయికి చెందిన ఆటోను తన ఉంటున్న ఇంటి ముందు నిలపాగా గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో తగలబెట్టారు. అది గమనించిన స్థానికులు మంటలు ఆర్పి ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే సగం కు పైగా దగ్ధం అయింది. కాగా సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వికాసంలో..
'వేమన' వెలుగులు

» 200 ఏళ్ల క్రితమే వేమన శతకం విశిష్టతను చాటిన సీపీ బ్రౌన్
» అదే మార్గంలో పయనిస్తున్న స్వచ్ఛంద సంస్థలు

నేడు తెలుగు భాషా దినోత్సవం



వేమన శతక, అష్టావధానాల్లో పాల్గొన్న చిన్నారులు (ఫైల్)



సత్తుపల్లి, ఆగస్టు 28: సరిగ్గా రెండొందల ఏళ్ల క్రితం అంటే 1,824లో తెలుగు భాషకు సంబంధించి రెండు అద్భుత సంఘటనలు జరిగాయి. అప్పటి కడప జిల్లా కలెక్టర్ సీపీ బ్రౌన్ ఈ సంఘటనలకు ఆద్యుడిగా ప్రచారంలో ఉంది. తెలుగు మాతృ భాషగా గల వారు సులభంగా భాష నేర్చుకోవటానికి వేమన శతకం చాలా ఉపయోగపడుతుందని ఆయన ప్రకటించడం మొదటి సంఘటన కాగా, సీపీ బ్రౌన్ తానే స్వయంగా వేమన శతకాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేసి వేమన భాషా మాధుర్యాన్ని ఆంగ్లేయులకు అందజేశారు. ఆనాటి నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు, భాషా ప్రేమికుల ఆధ్వర్యంలో తెలుగుభాషా అభివృద్ధికి కృషి జరుగుతూనే ఉంది.

సత్తుపల్లిలో కృషి

శతక పద్యాలతోనే పిల్లలకు మాతృభాష సులభంగా బోధించవచ్చని గ్రహించిన సత్తుపల్లికి చెందిన సృజన సాహితీ సమాఖ్య, గార్లపాటి పాపాచలం, బొల్లేపల్లి సత్యనారాయణరాజు స్మారక ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో సంయుక్తంగా రెండు దశాబ్దాలుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా సంస్థలు శతక పద్య పోటీలు నిర్వహిస్తున్నాయి.

సత్తుపల్లి మండలంలో ఉపాధ్యాయులు ఆసక్తిగా విద్యార్థులకు బోధించిన చోట చక్కని ఫలితాలు వచ్చాయి. ఈ క్రమంలోనే వేమన, సుమతి, శ్రీకృష్ణ, దాశరథి, కుసుమ సూక్తులు తదితర శతకాలు విద్యార్థులు చేర్చుకున్నారు. వందలాది పద్యాల ధారణ, అప్పగించడంతో పాటు కాగితాలపై రాసి చూపేవారు. ముఖ్యంగా వేమన శతకంలో విద్యార్థులు సాధించిన కొన్ని ఫలితాలు తెలు గు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా నమోదై ఉన్నాయి.

సత్తుపల్లి మండలానికి చెందిన విద్యార్థులు నాగ వంశీ, శ్రీలతలు వేమన పద్య శతావధానం, మూడవ తరగతి వయస్సులోనే విద్యార్థిని యామినిశ్రీ వేమన శతకాన్ని చివరి నుంచి మొద టి మొదటి పద్యం వరకూ అప్పగించడం, చిలకా రాహుల్ అనే విద్యార్థి వేమ న శతకాలను ఎనిమిది నిమిషాల్లో అప్పగించడం, బొర్రా మన్విత్ మూడో తరగతి చదువుతూ వేమన శతకంపై అష్టావధానం చేశాడు. ఇవి విద్యార్థినీ, విద్యార్థులు సాధించిన రికార్డుల్లో కొన్ని మాత్రమే. పిల్లల్లో ఆసక్తిని గమనించిన సృజన సాహితీ సమాఖ్య వేమన బాషామృతం పుస్తకాన్ని ముద్రించగా, పుస్తకాన్ని అప్పటి, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

వేమన శతకాలు సంపూర్ణంగా నేర్చుకోవడమే లక్ష్యంగా..

కోవిడ్ కారణంగా రెండు విద్యా సంవత్సరాలు కోల్పోయిన విద్యార్థుల మాతృ (తెలుగు) భాష ప్రమాణాలలో తిరోగమనాన్ని సమాఖ్య నిర్వాహకులు గుర్తించారు. ఉన్నత తరగతుల విద్యార్థులు చాలా వరకు ప్రాథమిక స్థాయి ప్రమాణాలను చేరుకోలేక పోతున్నారు. తరగతి గదిలో ప్రతీ ఉపాధ్యాయుడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఏమిటంటే పిల్లలు చదవడం రాయడం. ఈ సమస్య అధిగమించడానికి ఉపాధ్యాయులకు వెసులు బాటు కలిగించేలా గతంలో వేమన శతకాన్ని ప్రచురించామని, ఇటీవల కూడా మరి కొన్ని పుస్తకాలు ముద్రించినట్లు సృజన బాధ్యులు, ప్రచురణ కర్తలు బొల్లేపల్లి మధుసూదనరాజు, గార్లపాటి రామకృష్ణలు తెలిపారు. ఈ శతకం మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు అందరూ వంద పద్యాలు చదవడం, రాయడం నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది కనీసం వెయ్యి మంది విద్యార్థులు వేమన శతకాలు సంపూర్ణంగా నేర్చుకోవడం లక్ష్యంగా మండల విద్యాశాఖ సహకారంతో ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

ఎఫ్ఎల్ఎన్ అమలుకు వేమన పద్యాలు ఉపయోగం



● ఎస్.రాజేశ్వరరావు, మండల నోడల్ అధికారి, సత్తుపల్లి

ఫండమెంటల్ లెర్నింగ్ అండ్ న్యూమెరికల్ (ఎఫ్ఎల్ఎన్) వి ధానం ప్రస్తుతం అమలులో ఉంది. దీని లక్ష్యం పిల్లలు చదవడం, రాయడంలో నైపుణ్యం సాధించడం. ఇందుకు వేమన శతకం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతస్థాయి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

విద్యాశాఖ సంపూర్ణ సహకారం



చెల్లంచెర్ల వెంకటేశ్వరరావు, ఎంఈవో, సత్తుపల్లి

పాఠశాలల్లో జరుగుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు బాసటగా నిలవడం చాలా సంతోషం. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు మండల విద్యాశాఖ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తాం.

నెమలి నుంచి తిరుపతికి భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తుల బృందం

వైరా, ఆగస్టు 28: ఖమ్మం జిల్లాలోని వైరా, మధిర మండలాలకు చెందిన తొమ్మిదిమందితో కూడిన భక్త బృందం బుధవారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నెమలి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి మహాపాదయాత్రగా బయల్దేరింది. నెమలిలో వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తిరుపతికి పాదయాత్రగా బయల్దేరారు. మధిర మండలంలోని జాలిముడికి చెందిన శీలం కృష్ణారెడ్డి, రామచంద్రాపురానికి చెందిన మార్త నర్సింహారావు, వైరా మండలంలోని దాచాపురం గ్రామానికి చెందిన అయిలూరి శ్రీనివాసరెడ్డి, ముక్కర చెన్నారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, షేక్.మదార్‌రెడ్డి, గరిడేపల్లి కృష్ణ, గూడూరు కృష్ణారెడ్డి, శీలం కృష్ణారెడ్డిలు తిరుపతికి బయల్దేరి వెళ్లారు.

నిబంధనలు పాటించని నిర్మాణాలపై కేఎంసీ కొరడా

» ఒకే రోజు నాలుగు ఇళ్ల నిర్మాణాల నిలుపుదల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 28: నిబంధనలు పాటించని ఇళ్లు, అపార్టుమెంట్లు నిర్మాణాలపై ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు కొరడ ఝులిపించారు. బుధవారం ఖమ్మం నగరంలో నాల్గు ప్రాంతాల్లో నిర్మాణం జరుగుతున్న నివాసాలకు వెళ్లి ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటి నిర్మాణాలను నిలుపుదల చేశారు. దీంతో ఖమ్మంలోను హైడ్రా మొదలైందా అనే చర్చ ప్రారంభమైంది. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లు, అపార్టుమెంట్లపై గతంలోనే ఫిర్యాదులు రావడంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ ఏసీపీ వసుందర ఆధ్వర్యంలో టీపీవో, డీటీఎప్ బృందాలతో రాపర్తినగర్, మామిళ్లగూడెం, ఖమ్మం బైపాస్ బస్టాండ్ ఎదురుగా, జయనగర్ కాలనీలో కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం పర్యటించారు. రహదారుల మీదకు జరుగుతున్న నిర్మాణాలు, సెట్ బ్యాక్ లేకుండా జరుగుతున్న అపార్టుమెంట్‌లకు నోటీసులు జారీ చేశారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను నిలుపదల చేసి కూలీలను వెనక్కి పంపించేశారు. నిబంధనలకు మించి జరిపిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీపీవో విజయ్‌కుమార్, చైన్‌మ్యాన్ శ్రీను, డీటీఎప్ బృందం పాల్గొన్నారు.



నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

బాలికకు కాలం చెల్లిన సిరప్ పంపిణీ

» వైద్య సిబ్బందిని నిలదీసిన కుటుంబసభ్యులు

జూలూరుపాడు, ఆగస్టు 28: జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ బాలికకు కాలం చెల్లిన సిరప్ (టానిక్)ను ఇవ్వడంతో బుధవా రం బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి వెళ్లి వైద్య సిబ్బందిని నిలదీశారు. బాలిక తండ్రి వేమూరి అనీల్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడులోని న్యూకాలనికి చెందిన వేమూరి ప్రీతి స్థానిక ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కాగా మంగళవారం సదరు బాలిక పాఠశాలకు వెళ్లిన తర్వాత కళ్లు తిరుగుతుండటంతో ఉపాధ్యాయునికి చెప్పింది. దీంతో ఉపాధ్యాయుడు కుటుంబసభ్యులకు సమాచారం అందించి బాలికను ఇంటికి పంపించారు. దీంతో ఆ బాలికను తీసుకొని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు మందు బిళ్లలతో పాటు పోలిక్‌యాసిడ్ సిరప్ రాశారు. ఫార్మాసిస్ట్ సదరు బాలికకు వాటిని ఇచ్చింది. బాలిక మందు బిళ్లను వేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తండ్రికి సిరప్ సీసామూత తీసి ఇవ్వమని ఇచ్చింది. తండ్రి అనిల్ సిరప్‌మీద తేదీని చూడగా జూన్2024తోనే ముగిసినట్లు గుర్తించారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి విధుల్లో ఉన్న నర్సుకు విషయాన్ని తెలియచేయగా, వైద్యుడిని సంప్రదించాలని సూచించింది. దీంతో బాలిక తండ్రి, బంధువులు కలిసి ఆసుపత్రికి వెళ్లి వైద్యుడు వెంకటేశ్వర్లను కలిసి కాలం చెల్లిన సిరప్‌ను అందించడం ఏమిటని ప్రశ్నించారు. ఈవిషయమై వైద్యాధికారి వెంకటేశ్వర్లను వివరణ కోరగా ఆసుపత్రిలో అలాంటి సిరపులు 950 వరకు ఉన్నాయని, అవి 2026సంవత్సరం వరకు ఉన్నాయని, ఈ ఒక్క సిరప్ ఎలా వచ్చిందో విచారణ నిర్వహిస్తామని తెలిపారు.



వైద్య సిబ్బందిని నిలదీస్తున్న బాలిక కుటుంబసభ్యులు

ఆరేళ్ల చిన్నారికి డెంగ్యూ

» ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

జూలూరుపాడు, ఆగస్టు 28: మండలంలోని మాచినేని పేటతండా పంచాయతీ పరిధిలోని చిన్నతండా గ్రామానికి చెందిన లకావత్ ప్రతీక అనే ఆరేళ్ల చిన్నారికి డెంగ్యూ సోకింది. బుధవారం తల్లిదండ్రులు అశోక్ కుమార్, స్వాతిలు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతీకకు గత కొన్ని రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో మూడురోజులు క్రితం పరీక్షలు చేయించగా, డెంగ్యూ ఉన్నట్టు నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. దీంతో ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సను చేయిస్తున్నట్టు తెలిపారు. రక్తకణాలు కూడా 40వేలు ఉన్నట్లు వారు చెప్పారు. చిన్నారికి డెంగ్యూ సోకడంతో మాచినేనిపేటతండాలోని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామంలో పలువురు జ్వరాలతో మంచం పట్టారు.

తండ్రిని చంపిన కొడుకు అరెస్టు

మణుగూరు , ఆగస్టు 28: మండలంలోని పగిడేరు గ్రామంలో మంగళవారం తండ్రిని చంపిన కుమారుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంత కాలంగా బుచ్చిరాములు కుమారుడు సూర్యం తల్లిదండ్రులకు సంబంధించి ఉన్న ఆరు ఎకరాల పొలంలో వాటా ఇవ్వమని గొడవలు చేసేవాడు. 20 ఏళ్ల క్రితం బయ్యారం మండలం బోటుగూడెం గ్రామానికి చెందిన ఓ స్త్రీని వివాహం చేసుకున్నాడు. అతడికి కొడుకు కూడా ఉన్నాడు. కాగా 8 ఏళ్ల క్రితం ఇతని భార్య సూర్యాన్ని వదిలిపోయింది. అయితే పొలం మొత్తం తనకే ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవలు పడతూ ఓ పథకం ప్రకారం తండ్రి పొలం వద్ద ఉండగా కర్రతో తండ్రిపై దాడిచేశాడు. దీంతో తండ్రి బుచ్చిరామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా నిందితులు పరారు కాగా, బుధవారం పగిడేరు సమీపంలో పేరంటాల చెరువు ప్రాంతంలో ఉన్నారనే సమాచారంతో సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వ్యక్తిపై వరకట్న కేసు

మధిరటౌన్,ఆగస్టు28: వరకట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. మధిర పట్టణానికి చెందిన తడికమల్ల స్వాతిని గత కొంతకాలంగా తన భర్త రమేష్ వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆనాటి హామీలు.. నీటిమూటలేనా!?

» ఏళ్లు గడుస్తున్నా తీరని అశ్వారావుపేట సమస్యలు
» నియోజకవర్గం ఏర్పడి 15 ఏళ్లయినా ఏర్పడని కార్యాలయాలు
» జిల్లా కేంద్రం నుంచి లేని బస్సు సౌకర్యం
» కలగా మారినఅండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్
» సాకారం కాని డిగ్రీ కళాశాల స్వప్నం

అశ్వారావుపేట, ఆగస్టు 28: విభిన్న పంటకు పుట్టినిల్లు అశ్వారావుపేట. తెలంగాణ ఆంధ్రాల కలయిక ఈ ప్రాం తం. అభివృద్ధికి మారుపేరుగ నిలిచిన ప్రదేశం. రాజకీయ పరిణితి కలగిన ప్రాంతం. ఇదంతా గతం. ఇప్పుడు అనేక సమస్యల వలయంగా మారిపోయింది. పెరుగుతున్న పట్టణ జనాభా, విస్తరణకు తగ్గట్టు అభివృద్ధి జరుగలేదు. గతంలో మండలం కేంద్రంగా ఉం డి, ఇప్పుడు నియోకవర్గ కేంద్రంగా మారింది. నియోజకవర్గ కేంద్రంగా మారి కూడా 15ఏళ్లు పూర్తి అయ్యింది. నియోజకవర్గం ఏర్పడ్డాక నాల్గోవసారి ఎన్నికలు జరిగాయి. కాని ఎన్నికైన ప్రజా ప్రతినిధులు పట్టణ అభివృద్ధి పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

కార్యాలయాలు ఏవీ?

అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పడి 15 ఏళ్లు అయ్యింది. పేరుకే నియోజకవర్గ కేంద్రంలా ఉంది. ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడకి రాలేదు. ప్రతి డివిజన్ కార్యాలయం నియోజకవర్గం స్థాయిలో ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడంలేదు.


పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయం పేటలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నప్పటికీ ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాలు పాల్వంచ డీఎస్పీ పరిధిలో ఉండగా, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలు కొత్తగూడెం డీఎస్పీ పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేసి, ఐదు మండలాలు ఒకే డివిజన్ పరిధిలోకి తీసుకొని రావాలనే డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. ప్రతి పనికి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సివస్తుంది.

భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే అందరూ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ఏ ఒక్కరూ సాధించలేకపోయారు.

అశ్వారావుపేటలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలనేది పూర్వ కాలం నుంచి ఉన్న డిమాండ్. ఇప్పటి వరకు అది నెరవేరలేదు. వీటితో పాటు అనేక ఇంజనీరింగ్, పరిపాలన కార్యాలయాల డివిజనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి కార్యాలయాలు అన్ని నియోజకవర్గ కేంద్రం, దానిని ఆనుకొని ఉన్న పాల్వంచలోనే ఉన్నాయి. ఏ పని కావాలన్న జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. కాని జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే అశ్వారావుపేట నుంచి సరైన సౌకర్యం లేదు. వెళితే రావడానికి లేదు, వస్తే వెళ్లడానికి లేదు అన్నట్టు బస్సు సౌకర్యం ఉంది. దీంతో ప్రజలు పనికోసం వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడాల్సివస్తుంది.

శిథిలావస్థలో పెదవాగు ప్రాజెక్టు



అశ్వారావుపేట మండలంలోని పెదవాగు మధ్యతరహా ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇటీవలే కురిసిన వర్షాలకు కట్టకు గండి పడింది. తాత్కాలికంగా ప్రాజెక్టుకు రింగ్‌బండ వేసి సాగు నీరందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పనులు చేపట్టింది. ప్రాజెక్టు తెలంగాణలోను, కాలువలు ఏపీలో ఉండటంతో రెండు రాష్ట్రాలు సంయుక్తంగా గాని, గోదావరి బోర్డు ఆధ్వర్యంలో పనులు చేపడితే కాని ప్రాజెక్టు పూర్తి స్థాయిల వినియోగంలోకి వచ్చే పరిస్థితి లేదు. ఈ పనులు ఎప్పుడు అవుతాయో అనేది ప్రశ్నార్థంగా మారింది.



పట్టణంలో సెంట్రల్ లైటింగ్‌కు నోచుకోని ప్రధాన రహదారి

నెరవేరని ఎన్నికల హామీలు..

పంచాయతీ నుంచి పార్లమెంట్ ఏ ఎన్నికలు వచ్చిన సరే... ప్రతి రాజకీయ పార్టీకి, నేతలకు పట్టణ సమస్యలు కోకొల్లలుగా గుర్తుకువస్తాయి. ఆ తరువాత అంతా మామూలే అన్నట్టు ఉన్నాయి. పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కోర్టు, పట్టణంలో 100 పడకల ఆసుపత్రి, పోలీస్ సబ్ డివిజన్ వంటి కార్యాలయాలు ఏర్పాటు, ప్రజలు సేద తీరేందుకు పార్కు ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పిస్తుంటారు. మరో ప్రధానమైన సమస్య పట్టణంలో మరుగుదొడ్లు సమస్య. ఇవన్నీ ఎన్నికల హామీగానే మిగిలాయి. కొత్త కార్యాలయాల మాట అటుంచితే, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. మరి అశ్వారావుపేట సమస్యలను పట్టించుకునే వారెవ్వరో... వీటి పరిష్కారం ఎప్పుడు అవుతుందో అంటూ నిట్టూరుస్తున్నారు పేట వాసులు.

నియోజకవర్గంలో వేల ఎకరాల్లో ఆదివాసీలు పోడు భూములు సాగు చేసుకుంటున్నారు. అటవీశాఖాధికారులు, గిరిజనుల మధ్య పోడు భూముల వివాదం నడుస్తూనే ఉంది. గత ఎన్నికల ముందు పోడు భూముల కు కొన్ని పట్టాలు జారీ చేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో జరగలేదనే విమర్శలు ఉన్నాయి.

కాంగ్రెస్ నాయకుడు చందర్‌రావుకు మంత్రి తుమ్మల పరామర్శ

కల్లూరు, ఆగస్టు28: కల్లూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు అనారోగ్యానికి గురి కాగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతుండగా, సమాచారం తెలుసుకున్న మంత్రి తుమ్మ ల చందర్‌రావుతో పాటుగా కుటుంబ సభ్యులు సత్యశ్రీ, రమేష్‌లతో మాట్లాడి ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కల్లూరు ఆర్యవైశ్య సభ్యులు చారుగుండ్ల అచుత్యరావు, దోసపాటి కృష్ణార్జునరావు, రాయల నాగేశ్వరరావు, గుర్రం పూర్ణచందర్‌రావులు కూడా పరామర్శించారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ పట్ల హర్షం

ఖమ్మంటౌన్, ఆగస్టు 28: ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావటం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం కుదిరిందన్నారు. కవితపై ఆరోపణలు చేసి, రాజకీయంగా లబ్దిపొందాలని కొందరు ప్రయత్నించినా, సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని రుజువు చేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కవిత కీలకపాత్ర పోషించారని, ఆమెకు బెయిల్ రావటంతో తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం నగరంలో పర్యటించి పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఎస్సార్ గార్డెన్స్‌లో జరిగిన డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మనుమడు వివాహానికి సతీమణి చిన్నమ్మతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. నామా వెంట కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్, బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, మాజీ ఎం పీపీ బెల్లం ఉమ, నాయకులు మేళ్లచెరువు వేంకటేశ్వరరావు, న్యాయవాది పోట్ల మాధవరా వు, కోలేటి ప్రభాకర్, నామా రామారావు, సుధాకర్, ఉన్నం అప్పారావు. సకీనా తదితరులున్నారు.


శివాలయంలో కల్యాణమండపానికి శంకుస్థాపన

భద్రాచలం, ఆగస్టు 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో నూతన కల్యా ణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన(భూమిపూజ) నిర్వహించారు. బుధవారం దేవస్థానం వైదిక సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మండప నిర్మాణానికి రూ.5 లక్షలను పోలీసు అప్పారావు కుమారుడు యాలం శివ కృష్ణ వీరాంజనేయులు, సత్యకుమారి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగు విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు చిట్టిహనుమత్‌శాస్త్రి, లింగాల రామకృష్ణ ప్రసాద్, ఆలయ అర్చకులు అయిలూరి సుబ్రమణ్య శర్మ పాల్గొన్నారు.

భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పనులకు బుధవారం భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. భద్రాద్రి దేవస్థా నం విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు పర్యవేక్షణలో శంకుస్థాపనకు సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాటం

● పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి

ఖమ్మం రూరల్, ఆగస్టు 28: సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో స్త్రీ, పురుష సమానత్వం, శ్రామిక వర్గ మహిళా విముక్తి కోసం పీవోడబ్ల్యూ రాజీలేని పోరాటం చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మి అన్నారు. 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రగతీశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామంలో బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. లక్ష్మి మాట్లాడుతు దేశంలో, రాష్ట్రంలో రోజు రోజుకు మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిపై హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాధక్క, అలివేలు, కళ్యాణి, మాధవి, శాంతమ్మ, శ్రీలత, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి కుటుంబసభ్యుల నిర్ధారణ అవసరం

›› ఏడీఏ విజయచంద్ర

ముదిగొండ/తల్లాడ/వేంసూరు, ఆగస్టు 28: రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ కానీ రైతులకు కుటుంబసభ్యుల నిర్ధారణ అవసరమని మధిర ఏడీఏ విజయచంద్ర సూచించారు. బుధవారం ముదిగొండ మండలం వెంకటాపురంలో రేషన్‌కార్డు లేని పెండింగ్‌లో ఉన్న రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు అధైర్యపడి ఆందోళన చెందొద్దని, రుణమాఫీపై సందేహాలు ఉంటే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డు లేని రైతులు సందేహాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో సరిత, ఏఈవో మౌనిక, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీ గ్రామసభలు ప్రారంభం

తల్లాడ: రేషన్‌కార్డు లేక రుణమాఫీ కానీ రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం బుధవారం తల్లాడ మండలంలో గ్రామసభలు ప్రారంభమయ్యాయి. మండలంలోని రేజర్ల,



ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్న దృశ్యం

తెలగవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 106మంది రైతులకు సంబంధించిన కుటుంబ నిర్ధారణ చేశారు. కార్యక్రమంలో ఏవో ఎండీ.తాజుద్దీన్, ఏఈవోలు నరేష్, త్రివేణి, మాధవి పాల్గొన్నారు.

వేంసూరు: రూ.రెండులక్షల లోపు రుణమాఫీ కానీ రైతుల కోసం బుధవారం మండలంలోని లింగన్నపాలెం, యర్రగుంటపాడు గ్రామాల్లో ఏవో రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో రుణమాఫీ కాని పలువురు రైతులు దరఖాస్తులను సమర్పించారు.

గాంధీ-చౌక్‌లో కార్గో లాజిస్టిక్స్ సేవలు ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 28: ఖమ్మం పట్టణంలోని గాంధీ చౌక్ నందు టీ.జీ.ఎస్.ఆర్.టీ.సి కార్గో లాజిస్టిక్స్ సేవలను బుధవారం వర్తక సంఘం అధ్యక్షులు చిన్ని కృష్ణ ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తక్కువ సమయంలో పార్సిల్ చేరవేయుటకు గాంధీ చౌక్ కార్గో కేంద్రం నుంచి పార్సిల్స్ బుక్ చేసుకొని పంపించుకోవచ్చని తెలిపారు. ఖమ్మం గాంధీ చౌక్ ప్రాంతంలోని వ్యాపారస్తులు పార్సల్స్ ఇక్కడినుంచే బుక్ చేసుకుని పంపించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఖమ్మం డిపో మేనేజర్ పి. దినేష్ కుమార్ , గాంధీ చౌక్ లాజిస్టిక్ ఏజెంట్ పి. ప్రతాప్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్స్ బి.వీరభద్రం,కే.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

›› సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి
›› అవినీతి, అక్రమాలకు తావులేదు
›› సత్తుపల్లి, వేంసూరు, కల్లూరులో పర్యటన
›› సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 28: ప్రభుత్వం అందిస్తున్న పథకాలలో ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ అందిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి పట్టణంతో పాటు మండలానికి చెందిన రూ.89.10లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 89మందికి, రూ.22.45లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 72మందికి అందజేశారు. రాష్ట్రానికి రూ.7లక్షల కోట్ల అప్పులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను కుంటు పడకుండా పేదలకు అండగా నిలుస్తుందని చెప్పారు.

మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

స్థానిక బాలికల హైస్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సత్తుపల్లి మండల స్థాయి క్రీడాపోటీలను సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆల్ ది బెస్ట్ చెప్పారు. మంచి చదువుతో పాటు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేంసూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

నిర్ధారణ ప్రక్రియ ద్వారా రుణమాఫీ అమలుచేస్తాం

వేంసూరు: రూ.రెండులక్షల లోపు రుణమాఫీ కానీ రైతుల కోసం కుటుంబ నిర్ధారణ ప్రక్రియ ద్వారా రూ.రెండులక్షలలోపు రుణమాఫీ అమలుచేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి స్పష్టం చేశారు. వేంసూరు రైతువేదికలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాగమయి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ నిర్ధారణ ప్రక్రియ అన్ని గ్రామాల్లో ప్రారంభమైందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 50మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు 81మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ ఎంఏ.రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, పుచ్చకాయల సోమిరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరులో పర్యటన

కల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా మండలంలోని బత్తులపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డు పోస్టుమాస్టర్ శీలం వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సతీమణి సుశీలను కుమారులైన కాంగ్రెస్ నాయకుడు శీలం కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రఘునదన్‌రెడ్డిలతో మాట్లాడారు. ఇంకాను బత్తులపల్లిలో పొదిలి రోశయ్య, తిరుపతమ్మల కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. యర్రబోయినపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని నాగేశ్వరరావు, సరస్వతి నివాసాంలో వధువరులు శివ సునీల్, సింధూర ఆశీర్వదించారు. చెన్నూరు గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం వద్ద ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపును ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు లక్కినేని రమేష్, బాగం ప్రభాకరచౌదరి, పసువర్తి మోహనరావు, భూక్యా శివకుమార్‌నాయక్, కేవిఆర్, పోట్రు సత్యం, జంగా పిచ్చిరెడ్డి, ఆళ్ల నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

వైరా, ఆగస్టు 28: వైరా మునిసిపాలిటీ పరిధిలోని ఎనిమిదోవార్డు బ్రాహ్మణపల్లి అగ్రహారం కాలనీలో తమ ఇళ్ల మధ్య చేపట్టిన సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ ఆకాలనీకి చెందిన ప్రజలు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. తాము వ్యతిరేకిస్తున్నప్పటికీ ఏమాత్రం ఖాతర్ చేయకుండా సెల్‌టవర్ నిర్మిస్తున్నారని అందువలన ఈ నిర్మాణాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న ఇదే సమస్యపై తాము చేసిన విజ్ఞప్తిని వారు గుర్తుచేశారు. అయితే కొన్నినెలల నుంచి కాంట్రాక్టర్ నిర్మాణం గురించి మిన్నకుండిపోయి ఇప్పుడు మళ్లీ హడావుడి చేస్తున్నారని అందువలన తమ ఆరోగ్యం ఇతర సమస్యల దృష్ట్యా సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆవినతిపత్రంలో కోరారు.

మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలి

వైరా, ఆగస్టు 28: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు ఐద్వా నాయకురాలు గుడిమెట్ల రజిత ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఐద్వాతోపాటు తాను అధ్యక్షురాలిగా ఉన్న మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసేవిధంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అందువల్ల వచ్చేనెల ఏడున వినాయకచవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసి పర్యావరణాన్ని కాపాడేవిధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రంగు శ్రీలత, ఉష, చెరుకూరి వసంత, ఈలప్రోలు ప్రశాంత్, బత్తుల నాగార్జున పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

వైరా, ఆగస్టు 28: వైరాలోని జడ్పీబాలికోన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థినులు కె.అంకిత, ఎస్.పావని, కృష్ణలోహితలకు సోమవరం గ్రామానికి చెందిన ప్రవాసభారతీయుడు కొండబోలు సురేష్ ద్వారా ఆర్థికసహాయాన్ని ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు బుధవారం అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు జీవీ.సూర్యప్రకాశరావు ద్వారా ఈ విద్యార్థినుల ఆర్థిక సమస్యలను తెలుసుకున్న సురేష్ రూ.ఐదువేల ఆర్థికసహాయాన్ని ఎంఈవో చేతులమీదుగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి, ఉపాధ్యాయులు గాయత్రీ, సరళ, రమాదేవి, నాగమణి, రామలక్ష్మీ, గుల్జార్‌బేగం, శిరీష, ప్రేమలీల, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



వధువరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాములునాయక్

వైరా, ఆగస్టు 28: వైరాలోని ఓ పంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ పాల్గొన్నారు. నూతన వధువరులు భూక్యా స్వాతీ, లాలును రాములునాయక్ ఆశీర్వదించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి దంపతులు, రైతుసంఘం జిల్లా, మండల కార్యదర్శులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, నాయకులు వీరన్న, బాణోతు సురేష్, బండారు కృష్ణ తదితరులు కూడా నూతన వధువరులను ఆశీర్వదించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 28: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సులతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునకొల్లు నీరజ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 19, 40 డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేటర్ కమర్తపు మురళీ, నాయకులు ఖాదర్‌బాబా, భాస్కరరావు, బాలు, పాషా, వెంకటేష అబ్దుల్ అహద్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు తలొగ్గేది లేదు: కమల్‌రాజ్

మధిరటౌన్, ఆగస్టు 28: సీబీఐ, ఈడీ బెదిరింపులకు బీఆర్‌ఎస్ పార్టీ తలొగ్గదని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలలో కలిసి బుధవారం మధిరలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కి జైళ్లు, కేసులు కొత్త కాదని కేసులతో నాయకులను బెదిరించలేరని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, రూరల్ పట్టణ కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, యూత్ అధ్యక్షుడు కూన నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, ఆగస్టు 28: అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం కొత్తలింగాల ధనలక్ష్మి పంక్షన్‌హల్‌లో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. మాట్లాడుతూ అర్హులైన రైతులందరికి రుణమాఫీ జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేరదని అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలులో కూడా ప్రభుత్వం సంకల్పంతో పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, పీఏసీఎస్ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, మాజీ ఎంపీటీసీలు నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, గబ్రూ, సునీతలక్ష్మినారాయణ మండల అధ్యక్షుడు గింజల నర్సింహరెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, ఆరెం రవి, రాంబాబు, అశోక్, తదితర నాయకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత: కేఎంసీ మేయర్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 28: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చేయూత పథకాలను అందిస్తుందని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను మహిళ స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునకొల్లు నీరజ సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో కేఎంసీలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. స్థానిక కార్పొరేటర్ శ్రీవిద్య, అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, ఏడీ ఎంసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంబానికి హాజరైన వారు క్యాంటిన్‌లోని పదార్థాలను రుచి చూసి అనాసక్తి వ్యక్త పరిచారు. ఇవి ఇంటి వంటలు కాదనిపెదవి విరిచారు.

గంజాయి, మద్యానికి దూరంగా ఉండండి: ఎస్‌ఐ

నేలకొండపల్లి, ఆగస్టు 28: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, గంజాయి, మద్యం లాంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుని భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని నేలకొండపల్లి ఎస్‌ఐ పి.సంతోష్ విద్యార్థులకు హితవు చెప్పారు. నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్, గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్‌ఐ సంతోష్ పాల్గొన్నారు. గంజాయి సేవించే వారు లేదా అమ్మేవారి వివరాలు తెలిసినట్లైతే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. చదువుకునే సమయంలో కేసులైతే ప్రభుత్వ ఉద్యోగాలతో పాటుగా ప్రైవేటు ఉద్యోగాలు సైతం రావని ఆవిషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకుని మెలగాలని ఎస్‌ఐ కోరారు. సైబర్ నేరాలపై కూడ అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాల కేవైసీ అప్డేట్ అంటూ వచ్చే మెస్సేజ్‌లను విశ్వసించవద్దన్నారు.. సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ పరంజ్యోతి, ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఐసీడీఎస్

తల్లాడ, ఆగస్టు 28: మానవ అక్రమ రవాణా గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి కలిసికట్టుగా కృషి చేస్తే అక్రమ రవాణాను అడ్డుకోవచ్చునని ఐసీడీఎస్ అధికారి రోజా అన్నారు. పోలీస్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంస్థ ఆధ్వర్యంలో తల్లాడ మండలం నూతనకల్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలను నిర్మూలించాలన్నారు. స్కోప్ కోఆర్డినేటర్ సుజాత మాట్లాడుతూ బాలబాలికలు చదువుపై శ్రద్ధపెట్టాలని, దుర్వాసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌ను విజ్ఞానం పెంచుకోవడానికే వినియోగించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, కానిస్టేబుల్ లక్ష్మా, కల్యాణపు వెంకటేశ్వరరావు, నాగమణి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

ఏన్కూరు హెడ్‌రెగ్యులరేటర్ మరమ్మతు పనులు పూర్తిచేయాలి

ఏన్కూరు, ఆగస్టు 28: నాగార్జునసాగర్ ఎడమకాలవ ఎన్కూరు హెడ్ రెగ్యులేటర్ మరమ్మత్తు పనులను వెంటనే పూర్తిచేసి తల్లాడ, ఏన్కూరు, కొణిజర్ల మండలాల్లోని సాగు భూముకలు సాగర్ జలాలు అందించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏన్కూరు హెడ్‌రెగ్యులేటర్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మరమ్మతులు పేరుతో గతంలో ఉన్న రెగ్యులేటర్ షటర్లు తొలిగించడం వల్ల సిరిపురం, నూకాలంపాడు, ఆరికాయలపాడు మేజర్లకు సాగు నీరు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్‌రెగ్యులేటర్ పనులను త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందేవిధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, సీపీఎం మండల కార్యదర్శి దొంతేబోయిన నాగేశ్వరరావు, రైఉత సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా లక్ష్మా, ధరంసోతు రాందాస్, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తాం

ఖమ్మంటౌన్, ఆగస్టు 28: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అసవులు బాసిన విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామని వామపక్ష పార్టీల నేతలు పేర్కొన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ డే సందర్భంగా సత్తెనపల్లి రామకృష్ణ స్థూపం వద్ద నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎంజిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎంఐఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వై.విక్రమ్, మెరుగు సత్యనారాయణ, దొంగల తిరుపతిరావు, రమ్య, సీపీఐ నాయకులు పోటు కళావతి, సింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు పుల్లయ్య, ఆవుల అశోక్,ఝాన్సీ పాల్గొన్నారు.

వైభవంగా మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠ

నేలకొండపలి, ఆగస్టు 28: మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో రజకుల కుల దైవం మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆర్థిక సహాయంతో పాటు దాతల సహాయంతో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, సీడీసీ మాజీ అధ్యక్షుడు నెల్లూరి లీలీప్రసాద్, కాంగ్రెస్ నాయకులు చింతనిప్పు సైదులు, మాజీ సర్పంచ్ షేక్.మస్తాన్, రజక నాయకులు ఎల్లుట్ల సైదులు, కందగట్ల సైదులు, పసుపులేటి వెంకటేష్, కొక్కిరేణి వీరాస్వామి, మహేష్, శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాకామేశ్వరి ఆధ్యాత్మిక ఆశ్రమానికి భూమిపూజ

ఎర్రుపాలెం, ఆగస్టు 28: మండలంలో జమలాపురం ఆలయానికి దగ్గరలో కండ్రిక గ్రామ శివారులో శ్రీ మహాకామేశ్వరి ఆధ్యాత్మిక ఆశ్రమానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా శంకుస్థాపన, గణపతిపూజ, నవగ్రహ ఆరాధన, వాస్తుహోమం నిర్వహించారు. జమలాపురం లాంటి ఆధ్యాత్మిక దివ్యక్షేత్రానికి దగ్గరలో దైవాశ్రమం నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందని శ్రీ మహాకామేశ్వరి ఆధ్యాత్మిక ట్రస్టు చైర్మన్ సరికొండ శంకర్‌రాజు తెలిపారు. గ్రామపెద్దలు సామునూరి కృష్ణార్జునరాజు, స్థలదాత మిరియాల శ్యామ్‌ప్రసాద్, జమలాపురం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు వేమిరెడ్డి అంకిరెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా తిరుపతమ్మ, గోపయ్య విగ్రహాల ప్రతిష్ఠ

బోనకల్, ఆగస్టు 28: బోనకల్‌లోని ముత్యాలమ్మ తల్లి గుడి పక్కన నూతనంగా నిర్మించిన దేవాలయంలో బుధవారం తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా హోమ పూజలు చేయించారు. అర్చకులు వేద మంత్రాల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు నవ ధాన్యలు వేసి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విగ్రహాలను వేమ లలితా కుమారి దేవాలయానికి ఇచ్చి అమ్మవారి పట్ల తన భక్తిని చాటుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేజీబీవీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

ఏన్కూరు/కొణిజర్ల ఆగస్టు28: అనేక ఏళ్లుగా అరకొర జీతాలతో పనిచేస్తున్న కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని ఇఫ్టూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కేజీబీవీలో సమావేశం నిర్వహించారు.సమస్యల పరిష్కారంకోసం 30న హైదరాబాదులో జరిగే రాష్ట్ర ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో జిల్లానాయకులు స్వాతి, ఎస్‌వో తులసి, వినోద, విజేత, నాగమణి, జయమ్మ పాల్గొన్నారు.

కొణిజర్ల: సీఎం హామీ మేరకు కేజీబీవీలో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయు జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని లింగగూడెం కేజీవీబీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాధమ్మ, అనసూర్య, అనిత, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

తిరుమలాయపాలెం, ఆగస్టు 28: తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ ఈఈ వెంకటరెడ్డి బుధవారం సందర్శించారు. కార్యాలయం శిథిలావస్థలో ఉండి ఉద్యోగులు ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తహీసల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు పీఆర్ ఈఈ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని పరిశీలించారు.ఈనివేదికను మంత్రికి అందించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, డీటీ నర్సింహారావు, పీఆర్ ఏఈలు వేణుగోపాల్, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం క్రైం, ఆగస్టు 28: రెండుసార్లు వివాహం చేసుకొని భర్తలను వదిలేసిన ఓ మహిళ పెళ్లి చేసుకోవాలని యువకుడిని వేధిస్తూ ఉండడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకొని చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చింతకాని మండలం నాగులంచ గ్రామానికి చెందిన మందా రామారావు (27) నగరంలోని వీడియోస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలం క్రితం ఓ మహిళతో పరిచయం ఏర్పడగా పెళ్లి చేసుకోవాలని గొడవ చేసింది. అప్పటికే ఆమెకు రెండుసార్లు వివాహమై భర్తలతో విడిపోయి ఒంటరిగా ఉంటుంది. ఈ విషయం తెలిసిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో నాగులవంచలోని యువకుని ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేసింది. దీంతో మనస్తాపం చెందిన రామారావు ఈనెల 20న త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. అనంతరం కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు అక్కడికి చేరుకొని రామారావును నగరంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాణ్యమైన విద్య

›› యూనివర్సిటీ డీన్ ఆచార్య శ్రీనివాస్ వడ్డాణం
›› డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం

ఖమ్మం, ఖానాపురంహవేలి ఆగస్టు 28: అంబేద్కర్ ఓపెన్ యునివర్శిటీలో అందరికి అందుబాటులో నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటి దృశ్య శ్రవణ మాధ్యమం పరిశోధన, అభివృద్ధి కేంద్ర డైరెక్టర్, డీన్ సామాజిక శాస్త్రం ఆచార్య శ్రీనివాస్ వడ్డాణం అన్నారు. బుధవారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశానికి హాజరై మాట్లాడారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ(యూజీ) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో, పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, బీఎల్‌ఎస్‌ఐఎస్సీ, ఎంఎల్ఎస్సీ తదితర డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోగా ఆసక్తిగల అభ్యర్థులు ప్రవేశాలు పొందాలని సామాజిక శాస్త్రం ఆచార్య శ్రీనివాస్ వడ్డాణం, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ , ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్. కళాశాల, ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ డా. వీరన్న, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి రసాయన శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ దొడ్డపునేని కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలోని అంబేద్కర్ యూనివర్సిటీ ఖమ్మం ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని డైరెక్టర్ సందర్శించారు. వడ్డాణం శ్రీనివాసరావు మాట్లాడుతూ, రెగ్యులర్ డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులు చేయలేని విద్యార్థులకు, గృహిణులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారులకు, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనుకొనే వారందరికీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 44 సంవత్సరాలుగా అందుబాటులో వుంటు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. యూనివర్సిటీ నాక్ - ఎ గ్రేడ్ ని సాధించిందని అన్నారు. డిగ్రీ కోర్సులు సెమిస్టర్ సిస్టంలోను, పీజీ కోర్సులు ఇయర్వైజ్ స్కీంలో నిర్వహిస్తున్నామన్నారు. కాంటాక్ట్ తరగతులతో పాటు స్టడీ మెటీరియల్ ని అందజేస్తున్నట్లు తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని యూనివర్సిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ దొడ్డపునేని కోటేశ్వరరావు తెలిపారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని అన్నారు. డిగ్రీ, పీజీ పూర్వవిద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో సకాలంలో ఫీజులు చెల్లించలేకపోయిన వారు 2015-16 నుంచి 2023-24 వరకు అడ్మిషన్లు పొంది ఉంటే వారు కూడా ఫీజులు చెల్లించేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీన్ ఆచార్య శ్రీనివాస్

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 28: సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న హామీ నీ ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ నందు ఒక్క రోజు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ దీక్షా కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 30 రోజులపాటు చేసిన దీక్షా కార్యక్రమాలలో ఇప్పటి మంత్రులు, ముఖ్యమంత్రి పాల్గొని అధికారంలోకి వచ్చిన 100 రోజులలో క్రమబద్ధీకరణ చేస్తామని అప్పటి టీపీసీసీ చీఫ్ , ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, .హామీని అమలు చేయాలన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు , పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వైవి రావు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ మద్దతు పలికారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రోడ్డు మీద వెళ్తున్న ర్యాలీని చూసి దగ్గరకు వచ్చి సమస్యను తెలుసుకొని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సంఘాల ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

నాచారం పాఠశాలకు టీవీ వితరణ

ఏన్కూరు, ఆగస్టు 28: మండల పరిధిలోని గంగుల నాచారం పాఠశాలకు హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో బుధవారం టీవీ వితరణ చేశారు. నాచారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వక్కంతుల నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన హెల్పింగ్‌హ్యాండ్ సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో ఎంఈవో జయరాజు చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం గోపికి టీవీని అందించారు.ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కూరాకుల సైదయ్య, గ్రామమాజీసర్పంచ్ వర్ష మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ ఎలగల నరసమ్మ, గ్రామస్తులు మల్యం గంగులు, వాసం బీమరాజు, వర్షా గోపాలరావు, ముక్తి గంగులు, కృష్ణ పాల్గొన్నారు.

ఫైనాన్స్ కార్యాలయం ప్రారంభం



నిర్వాహకులను అభినందిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 28: ఖమ్మం నగరంలో శ్రీహర్ష ఫైనాన్స్ కార్యాలయాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు.ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు జమ్మి నర్సింహారావును అభినందించారు. కార్పొరేటర్ బట్టపోతుల సతీష్, ప్రముఖ లాయర్ కండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

కొణిజర్ల, ఆగస్టు 28: మండలంలోని తనికెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా జరిపారు. పాఠశాల పీడి దొండపాటి శ్రీనివాస్ విద్యార్థులచే పుస్తకాలతో జాతీయ క్రీడాదినోత్సవంను రాపించి క్రీడల విశిష్టతను వివరించారు.